సాక్షి చిత్తూరు

సోమవారం। 10। జూన్। 2024



రూ.35 లక్షల విరాళం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఆదివారం రూ.35 లక్షల విరాళం అందింది. - 2లో



బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉపాధ్యాయ. ఉద్యోగులకు బకాయిలను కొత్త ప్రభుత్వం తక్షణం చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత శ్రీనివాసరావు కోరారు. - 2లో



ప్రబలిన అతిసారం

పుత్తూరు పరిధి నందిమంగళంలో అతిసారం ప్రబలింది. గ్రామంలో డీఎంహెచ్ఓ శ్రీహరి పర్యటించారు. - 2లో

న్యూస్‌రీల్

కాణిపాకంలో కిక్కిరిసిన భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేకువజామున అభిషేక పూజల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా క్యూకట్టారు. ఉదయం 9 గంటల నుంచి ఒక్కసారిగా పోటెత్తారు. క్యూలన్నీ నిండున్నాయి. ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ అధికారులు దగ్గరుండి త్వరితగతిన భక్తులకు దర్శనభాగ్యం కల్పించే ప్రయత్నం చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాల ని పంచాయతీ అధికారులను డీపీఓ లక్ష్మి ఆదేశించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వర్ష ప్రభావం ఎక్కువ ఉంటే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. కాలువల్లో పూడికలు తీసి సకాలంలో చెత్తచెదారాలు తొలగించాలన్నారు. ఈగలు, దోమలు రాకుండ బ్లీచింగ్ వేసి, వీధిదీపాలు పనిచేయకపోతే మార్పు చేయాలని సూచించారు. తాగునీటి పైప్‌లు లీకేజీ లేకుండా చూడాలని, దోమల నివారణకు రోజూ ఫాగింగ్ చేయించాలన్నారు. పరాశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని తెలిపారు.

ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)ల్లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 14వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్స్‌లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎటువంటి ఫీజులు వసూలు చేయరని డీఈఓ తెలిపారు.

మినిమం టైమ్ స్కేలు అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మినిమం టైం స్కేలు విధానంలో నియమితులైన టీచర్ల ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 1998, 2008 డీఎస్సీ లలో ఎంపికైన టీచర్లకు మినిమం టైం స్కేలు విధానంలో నియామకాలు కల్పించారని అయితే 2023 జూన్ నెల నుంచి 2024 ఏప్రిల్ వరకు మినిమం బేసిక్ పే మంజూరు చేశారని పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 30న వారందరినీ విధుల నుంచి తొలగించి తిరిగి జూన్ 1వ తేదీ నుంచి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని, ఇప్పటి వరకు ఆ ఉత్తర్వులను అమలు కాలేదని తెలిపారు. 1998, 2008 డీఎస్సీలలో ఎంపికైన టీచర్లను పాత ప్లేసులలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నగరిలో 7 అడుగుల కొండచిలువ




కొండచిలువను చూపుతున్న శ్రీకాంత్

నగరి : మున్సిపల్ పరిధి దేశమ్మ దేవాలయం సమీపం దేవనాసపురంలో ఏడు అడుగుల కొండచిలువను ఆదివారం పట్టేశారు. గడ్డివాములోకి పెద్ద కొడచిలువ వెళుతుండగా గమనించిన స్థానికులు స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. ఆయన గ్రామానికి చేరుకుని గంటపాటు పోరాడి ఏడు అడుగుల కొండచిలువను పట్టారు. దాన్ని అటవీప్రాంతంలో వదలిపెడుతున్నట్లు శ్రీకాంత్ తెలిపారు.

అలసి..సొలసిన మనసుకు కాస్త స్వాంతన దొరకాలని పరితపిస్తుంటారు. ఖాళీ సమయంలో సరదాగా గడపాలని ఉబలాట పడుతుంటారు. ఇలా కొందరు తూపిలిపాళెం బీచ్‌కు వచ్చి సంతోష సాగరంలో మునిగితేలుతుంటారు. జలకాలాట ఆడుతూ.. కెరటాలతో సెల్ఫీలు దిగుతూ కేరింతలు కొడుతుంటారు. ఈ క్రమంలో అక్కడ ప్రమాదకరంగా ఉన్న జెట్టీ నిర్మాణంపై నుంచి కొందరు సముద్రంలోకి దూకి హీరోయిజం ప్రదర్శిస్తుంటారు. ఇలా దూకిన చాలామంది జలసమాధి అవుతున్నారు. కూలేందుకు సిద్ధంగా జెట్టీ కింద సుడిగుండాలు పొంచి ఉన్నాయని తెలియక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దీనిపై పోలీస్ శాఖ స్పందించి.. రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మింగేస్తున్న జెట్టీ!



శిథిలావస్థకు చేరిన జెట్టీ పిల్లర్లు

- విహారం మాటున పొంచి ఉన్న విషాదం
- తీరంలో ప్రమాదకరంగా నిర్మాణం
- పర్యాటకులకు జాగ్రత్త అవసరం



తూపిలిపాళెం తీరంలో పర్యాటకుల సందడి

వాకాడు: తూపిలిపాళెం బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. సాధారణ రోజుల్లో రోజుకు పదివేల మందికిపైగా.. ఆదివారం.. సెలవు రోజుల్లో అయితే లక్షల మంది వచ్చి జలకాలాడుతుంటారు. అందుకు అనుగుణంగానే తీరంలో ఎటుచూసినా పచ్చని సవకతోటలు, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. మరో పక్క నిత్యం సముద్రపు అలలతో సుందరమైన ప్రకృతి ఇక్కడ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలో తూపిలిపాళెం బీచ్‌కు వచ్చేవారు ఇక్కడి అందమైన ప్రదేశాలను సందర్శించి సంతోషంతో ఉప్పొంగిపోతుంటారు. ఈ సుందరమైన ప్రదేశం వెనక తెలియని అతి భయంకరమైన విషాదం ఉందన్న నగ్నసత్యాన్ని చాలా మంది గమనించలేకపోతున్నారు. ప్రమాదాలు పొంచి ఉన్న స్థలాలను పసిగట్టలేక గడిచిన పదేళ్ల కాలంలో దాదాపు 25 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.



ఎగసి పడుతున్న అలలు

జెట్టీ యమడేంజర్

తీరంలో ఉప్పునీటి కోసం 1990లో సముద్రం లోపల నుంచి ఏర్పాటు చేసిన ఎత్తిపోతల వంతెన(జెట్టీ) ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన దాదాపు 200 మీటర్లు సముద్రంలోకి ఉండి, అక్కడి నుంచి 3 కి.మీ పొడవున ప్రవహిస్తూ ఉండేది. ఇది సుమారు 50 మీటర్ల ఎత్తు ఉంటుంది. ప్రస్తుతం ఈ వంతెన బాగా దెబ్బతింది. పిల్లర్లకు సిమెంటు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. హాయిగా ఆహ్లాదాన్ని అందిస్తుందన్న సంతోషంతో కొందరు, మద్యం మత్తులో మరికొందరు వంతెన పైకి ఎక్కి సముద్రంలోకి దూకుతుంటారు. ఇలా దూకిన తర్వాత ప్రమాదాలబారిన పడి పలువురు జలసమాధి అవుతున్నారు. జెట్టీ నిర్మాణపు ప్రాంతానికి అతి సమీపంలో కెరటాల ఉధృతితో పాటు స్వతహాగా విపరీతమైన లోతు ఉంటుంది. తూపిలిపాళెం గ్రామ సమీపాన ఉన్న మొదటి తీరంలో పర్యాటకులకు స్నానాలు చేసేందుకు అనువుగా ఉంటుంది. కానీ ఎక్కువ మంది జెట్టీ అందాలను చూసేందుకు అక్కడికే వెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. కానీ ఇక్కడ ప్రమాదాల నివారణకు ఎలాంటి హెచ్చరిక బోర్డులుగానీ, బారికేడ్లు కానీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిఘా పెంచాలి.. ప్రాణాలు రక్షించాలి

- తూపిలిపాళెం బీచ్‌లో ఆదివారం రోజుల్లో పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలి.
- స్నానాలు చేసే సమయంలో సముద్రం వద్ద బారికేడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వాటిని దాటి పర్యాటకులు వెళ్లనీకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలి.
- విద్యార్థులను విహారానికి పంపేటప్పుడు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు చెప్పి పంపాలి. తమ పిల్లలు ఎవరి సంరక్షణలో వెళుతున్నారో కాస్త ఆరా తీయాలి.
- తూపిలిపాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి అతిథిగృహం ఎదురుగా ఉన్న మొదటి ఘాట్‌లోనే స్నానాలు చేయాలని, జెట్టీ వద్దకు వెళ్లరాదని పిల్లలకు చెప్పి మరీ పంపాలి. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని జెట్టీ కూల్చే ప్రయత్నం చేయాలని గ్రామస్తులతోపాటు, పర్యాటకులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు అవసరం



సరదా కోసం తూపిలిపాళెం బీచ్‌కు వస్తున్న పర్యాటకులు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించలేక మృత్యువాత పడుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు పొంచి ఉండే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం అవసరం. అలాగే తీరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి.

– రాయిపు రవీంద్ర, పర్యాటకుడు, కల్లూరు కొత్తపాళెం

ప్రమాదకరంగా ఉంది



సముద్ర తీరంలో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రస్తుతం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీనిపై నుంచి చాలా మంది యువకులు సముద్రంలోకి దూకి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పకడ్బందీగా భద్రత కల్పించాలి. లేకపోతే ఈ వంతెనను పూర్తిగా తొలగించాలి.

– వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, తూపిలిపాళెం

ఆదరించిన ప్రజలకు అండగా ఉండాలి

- నూకతోటికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి సూచన



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: తక్కువ సమయంలో ఎక్కువగా ఆదరించిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ అండగా ఉండాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆదివారం పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను పెద్దిరెడ్డి అడిగి తెలుసుకున్నారన్నారు. 81వేలకు పైగా ఓట్లు వేసి ఆదరించిన ప్రజలకు అందుబాటులో ఉంటానని రాజేష్ పేర్కొన్నారు. కార్యకర్తలు సంయమనం పాటించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,398 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 43,557 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ధ్వంసం.. నవరత్న నిలయం



ధ్వంసమైన శిలా ఫలకాలు, బొమ్మలు (ఇన్‌సెట్) నవరత్నాల నిలయం(ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ సమీపంలోని రాజీవ్‌నగర్‌లో నిర్మించిన నవరత్న నిలయంపై శనివారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. శిలాఫలకాలు, వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను ధ్వంసం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన రైతు, గ్రామీణ మహిళ బొమ్మలను నాశనం చేశారు. ఈ క్రమంలో సుమారు 40 మంది పచ్చపార్టీ శ్రేణులు ఆటోలు, కార్లలో రాజీవ్‌నగర్‌కు చేరుకుని కర్రలు, రాళ్లతో హల్‌చల్ చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. మొదట ప్రధాన రహదారి పక్కన నిర్మించిన కట్టడాల్లో దూరి షట్టర్లు విరగొట్టారు. అనంతరం విద్యుత్ మీటర్లు పగులగొట్టి, ఓ ఇంటి బోరులో పైపులను బయటకు లాగి మోటర్లను ఎత్తుకెళ్లారు. అనంతరం నవరత్నాల నిలయం వద్దకు చేరుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఇతర మంత్రుల చిత్రపటాలను, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. జగనన్న కాలనీ ముందు నిర్మించిన ఆర్చిపై రాళ్లతో దాడి చేసి పగులగొట్టారు. స్థానికులు స్పందించి పోలీసులకు ఫోన్ చేశారు. 2వ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో దుండగులు పరారయ్యారు. ఆదివారం ఉదయం పురపాలసంఘ కమిషనర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టీడీపీ కార్యకర్తలు పగులగొట్టిన వాటితోపాటు నిలయంలోని ఇతర చిత్రపటాలను తొలగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండువేల ఇళ్లను జగనన్న కాలనీ పేరుతో ఇక్కడ పేదలకు పంపిణీ చేశారు. అందుకు గుర్తుగా కాలనీ ముందు ఖాళీ స్థలంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సొంత నిధులతో నవరత్నాల నిలయం సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేశారు. వాటిని సైతం పచ్చమూక ధ్వంసం చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా పురపాలకసంఘం వారు ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మొత్తం వివరాలను పోలీసులకు అందజేశామని తెలిపారు.

దాడుల సంస్కృతి దారుణం

"అధికారంలోకి వచ్చామనే సంతోషంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు.. సానుభూతి పరులపై దాడులకు తెగబడుతున్నారు. ఒంటరిగా కనిపిస్తే చాలు రక్తం కళ్ల చూస్తున్నారు. ప్రజలు అప్పగించిన పదవిని ఉపయోగించుకుని పది మందికీ మంచి చేయాలి. ప్రత్యర్థులను దెబ్బతీసేలా అరాచకాలకు పాల్పడడం సరికాదు. ఈ సంస్కృతి ఎప్పుడూ చంద్రగిరి చరిత్రలో లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీ వారిని అందరితో సమానంగా గౌరవించాను. ఇప్పుడు అవన్నీ మరిచిపోయి విధ్వంసాలకు దిగడం ఎవరికీ మంచిదికాదు" అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు.



చిన్నగొట్టిగల్లు సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- చంద్రగిరిలో ప్రత్యర్థులను భయపెట్టడమే టీడీపీ లక్ష్యం
- కొనసాగుతున్న ఆస్తుల విధ్వంసం
- ఐకమత్యంతో పచ్చమూకను ఎదుర్కొందాం
- ప్రతిదాడులతో సమస్య పరిష్కారం కాదు
- ప్రాణాలు అడ్డుపెట్టి కార్యకర్తలను కాపాడుకుంటా
- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గంలో ప్రత్యర్థులపై టీడీపీ నేతల దాడులు ఆగడం లేదని, యథేచ్ఛగా సాగుతున్న అరాచకాలతో భయానక వాతావరణం నెలకొని ఉందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తలతో మమేకమవుతూ వారికి మనోధైర్యం కలిగించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలు అధికారం మత్తులో ప్రత్యర్థి పార్టీని లేకుండా చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి మరీ కార్యకర్తలను కాపాడుకుంటామని తెలిపారు. అయితే దాడికి ప్రతి దాడి చేయడం సమస్యకు పరిష్కారం కాదని సూచించారు. ఐకమత్యంతో మెలిగితే దాడులను పకడ్బందీగా ఎదుర్కోవచ్చని పిలుపునిచ్చారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలచే చంద్రగిరిలో తెలుగుదేశం కార్యకర్తలు గత మూడు రోజులుగా చేస్తున్న ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మనమంతా ధైర్యంగా ముందుకు వచ్చి ఎవరిపై దాడి జరిగినా క్షణాల్లో అక్కడకు చేరుకుని ఐక్యతను చాటుకుంటే అల్లరిమూకలకు భయం కలుగుతుందని చెప్పారు. కార్యకర్తలు, నాయకులతో ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేయడం టీడీపీ పైశాచికత్వానికి నిదర్శనంగా నిలుస్తోందని విమర్శించారు. ఓటమి బాధలో ఉన్న సమయంలో మా కార్యకర్తలపై దాడులు చేయడం, భయపెట్టి లొంగదీసుకోవాలని చూడడం గతంలో ఎన్నడూ చంద్రగిరిలో జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రగిరి ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు మీసాల వెంకటరామానాయుడు, రామ్మూర్తినాయుడు, గల్లా అరుణకుమారి ఎవరూ ఎలాంటి దారుణాలకు పాల్పడలేదని వెల్లడించారు. ఇప్పుడు మాత్రమే ఎందుకు విధ్వంసాలు జరుగుతున్నాయో ప్రజలు గుర్తించాలని కోరారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు ఈ దాడులను ఆపకుంటే ఎంతవరకైనా పోరాడుతామని, అవసరమైతే రోడ్డెక్కి ఆందోళనలు, ఆమరణ నిరాహార దీక్షలకు సైతం దిగుతామని హెచ్చరించారు. జిల్లా పోలీసు అధికారులు స్పందించి చంద్రగిరి నియోజక వర్గంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎన్నికలప్పుడు హడావుడి ఉన్నా తర్వాత ఎవరి పని వారు చేసుకుంటూ కలిసిమెలసి ఉండేవారమన్నారు. 2019లో పులివర్తి నాని రాకతో మంచి సంస్కృతికి తూట్లు పడ్డాయని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యర్థులపై దాడులు చేసే స్థాయికి దిగజారిపోయారని విమర్శించారు. చంద్రగిరి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధి చేసి చూపించాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అన్నా, ఊరికే కనిపిద్దామని..!



ప్రభుత్వం మారింది. గెలిచిన ఎమ్మెల్యేల చూపంతా ఇపుడు పోలీసుశాఖపై పడింది. తమకు అనుకూలంగా ఉన్నవాళ్లకు పోస్టింగులు ఇప్పించుకోవాలని నేతలు ఇప్పటికే జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఆశావహులు సైతం మంచి స్టేషన్లు, సబ్–డివిజన్ల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈవారమే పోలీసుశాఖలో బదిలీలు తప్పవని సీనియర్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలువురు సబ్–డివిజన్లకు డీఎస్పీల నుంచి ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల వరకు నేతలను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.



చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయం

- జిల్లా పోలీసుశాఖలో బదిలీలు తప్పనిసరి
- టీడీపీ నేతల వద్ద క్యూ కడుతున్న పోలీసులు
- ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్న ఆశావహులు
- కొందరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం
- డీఎస్పీ నుంచి.. ఎస్‌బీ కానిస్టేబుల్ వరకు ప్రదక్షిణలు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో పుంగనూరు తప్ప మిగిలిన ఆరు అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవశం చేసకున్న విషయం తెలిసిందే. పుంగనూరులో టీడీపీ ఇన్‌చార్జ్‌తో కలిపి మిగిలిన ఆరు చోట్ల కూడా నాయకులు తమకు అనుకూలంగా ఉన్న సీఐలు, ఎస్ఐల వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కొందరు ఇప్పటికే జాబితా సిద్ధం చేయగా, మరికొందరు తమకు పోలీసుశాఖలో ఉన్న పరిచయాల ఆధారంగా గతంలో తమకు అనుకూలంగా ఉన్న అధికారులు ఎక్కడున్నారో అంటూ ఆరా తీస్తున్నారు. పలమనేరు, పుంగనూరు, నగరి నియోజకవర్గాల్లో పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ఆయా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్నారని తెలుస్తోంది. తమకు ఇక్కడ పోస్టింగ్ ఇప్పించాలని నేరుగా కోరకుండా.. పూలబొకే చేతికి అందించి 'అన్నా, ఊరికే కనిపిద్దామని వచ్చాను' అని చెబుతున్నారు. గతంలో తాము పనిచేసిన స్థాయిని వివరిస్తూ, అప్పట్లో చేసిన అనుకూల ఘటనలను ఉదహరిస్తున్నారు.

కుప్పంలో కార్యదర్శులు..

కుప్పంలో పోస్టింగుల విషయమై చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శులు పలువురి పేర్లను ఎంపిక చేసి అధిష్టానానికి పంపతున్నట్లు సమాచారం. పూతలపట్టులో ఎమ్మెల్యే కొత్తకావడంతో ఐదు మండలాల్లోని టీడీపీ నేతల సలహాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పూర్తిగా తనకు నచ్చిన అధికారులను నియమించుకునేలా ఎమ్మెల్యే ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన చిత్తూరులో కూడా పూర్తిగా ఎమ్మెల్యేనే నేరుగా పోలీసు అధికారుల నియామకంపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు.

బయటి జిల్లాల నుంచే..

ఎక్కువ శాతం పోలీసు అధికారులు బయటి జిల్లాల నుంచి చిత్తూరుకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇందులో తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న ముగ్గురు సీఐ స్థాయి అధికారులు పలమనేరు, బంగారుపాళ్యం స్టేషన్లను అడుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఓ డీఎస్పీ పలమనేరు పోస్టింగుపైనే పట్టుగా ఉన్నారని, ఇందుకు మాజీ మంత్రి సైతం పచ్చ జెండా ఊపారని ప్రచారం జరుగుతోంది. సీఐడీ విభాగంలో డీఎస్పీ ఒకరు నగరిపై గురి పెట్టినట్లు సిబ్బందే చెప్పుకుంటున్నారు. తిరుపతి ట్రాన్స్‌కో సీఐ ఒకరు చిత్తూరు వెస్ట్ కావాలని, గతంలో చిత్తూరులో పనిచేసి డీటీసీలో ఉన్న సీఐకి చిత్తూరు వన్‌టౌన్‌పై హామీ లభించినట్లు సమాచారం. కర్నూలు జిల్లాలోని లూప్‌లైన్‌లో ఉన్న మరో సీఐ పలమనేరుకు వస్తున్నట్లు సమాచారం.

ఎస్‌బీకి తీవ్ర పోటీ..

లా అండ్ ఆర్డర్ విషయం పక్కన పెడితే ఈసారి స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ) విభాగానికి సైతం తీవ్ర డిమాండ్ నెలకొంది. ఎస్పీకి దగ్గరగా పనిచేస్తూ, ఇదే సమయంలో పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడానికి ఇప్పటికే కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ స్థాయి అధికారులు కర్చీఫ్‌లు వేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎస్‌బీలో పనిచేసిన అనుభవాన్ని, సామాజిక వర్గాన్ని చూపించి కొందరు నేతలను పోస్టింగులు అడుగుతున్నారు. అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే వారంలో ఎస్ఐలు, సీఐల బదిలీలు.. పది రోజుల్లో కిందిస్థాయి సిబ్బందికి స్థానచలనం జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

కాణిపాక ఆలయానికి రూ.35 లక్షల విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం బొమ్మనహల్లికి చెందిన దాత గోపినాథ్ కుటుంబ సభ్యులు భారీగా విరాళం అందించారు. దేవస్థానం అన్నదానం ట్రస్టుకు రూ. 20 లక్షలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ. 15 లక్షల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపి, ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, విగ్నేష్, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవికి రాజీనామా

కార్వేటినగరం: దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ టి.సుమతి ఆదివారం పదవికి రాజీనామ చేశారు. ఆమె మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ పదవికి రాజీనామ చేశామన్నారు. రాజీనామ లేఖను కార్పొరేషన్ సీఏస్‌కు మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు.

మామిడి తోటల్లో ఏనుగుల విధ్వంసం


ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లె సమీపంలోని మామిడితోటల్లోకి ఆదివారం తెల్లవారి జామున ఏనుగులు విరుచుకుపడ్డాయి. రైతు రవీంద్రనాథనాథరెడ్డికి చెందిన మామిడితోటలో భారీగా కొమ్మలు విరిచేయడంతోపాటు కాయలను నేల పాలు చేశాయి. కోత కొచ్చిన కాయలు రాలిపోయి భారీగా నష్ట పోయినట్లు బాధిత రైతు వాపోయారు. పొలాలపైకి ఏనుగులు రాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈతకు వెళ్లి గల్లంతు


మహేంద్ర (ఫైల్)

రాపూరు : స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన రాపూరు మండలంలోని రాపూరు–చిట్వేలి ఘాట్ రోడ్డు సిద్ధేశ్వర కోనవద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్యాద్రి కథనం.. నెల్లూరు మూడో మైలుకు చెందిన మహేంద్ర(18) నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులతో కలసి స్థానిక కోనేరులో ఈత కొట్టేందుకు వచ్చి గల్లంతయ్యాడు. పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

టీకాతో ‘చిటుక’ నివారణ

జీవాలను ఆశించే చిటుక రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ రోగం ఆశిస్తే జీవాలు నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. కాబట్టే ఈ వ్యాధిని చిటుక రోగమంటారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 35,784 గొర్రెలు, 33,411 మేకలున్నాయి. వీటికి చిటుక వ్యాధి సోకుండా, అలాగే నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. టీకాల కార్యక్రమం మొదలైన నేపథ్యంలో గొర్రెల్లో ఈ వ్యాధి ఎప్పుడు వస్తుంది..?, లక్షణాలు ఎలా ఉంటాయి..? నివారణ పద్ధతులపై పశుసంవర్ధక శాఖాధికారులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. – కాణిపాకం


కాణిపాకం: గొర్రెలకు టీకా వేస్తున్న సిబ్బంది

- తొలకరితో జీవాలకు పొంచి ఉన్న వ్యాధి
- నిర్లక్ష్యం వద్దంటున్న పశుసంవర్ధకశాఖ అధికారులు
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని సూచన

తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాల్ అనే విష పదార్థం విడుదల కావడం వల్ల చిటుక వ్యాధి ఆశిస్తుంది. గొర్రెలు, మేకల్లో అంటువ్యాధులు సోకక ముందే వ్యాధి నిరోధక టీకాలు వేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గొర్రెలు, మేకలకు గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు, మొదలైన అంటువ్యాధులు తొందరగా సోకుతాయి. ఒక మంద నుంచి వేరొక మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధులకు చికిత్స బదులు నివారణే శ్రేయస్కరమని గుర్తించాలి. చిటుక వ్యాధి మేకలకన్నా గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది.

లక్షణాలు..

రాత్రి బాగా ఉండి తెల్లారే సరికల్లా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణిస్తుంటాయి. ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి అకస్మాత్తుగా మరణిస్తాయి. జ్వరం, పళ్ల కొరకడం, వణకడం, బిగుసుకునిపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండడం, కాళ్లు బిగిసి పట్టి నడవడం, శ్వాస కష్టమవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపునొప్పి, మందకొడిగా ఉండడం, మేత సరిగ్గా తినకపోవడం వంటి లక్షణాలుంటాయి.

నివారణ ఇలా...

- వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలకు పెరిగిన గడ్డిని ఎక్కువగా మేపరాదు.
- వరి కోసిన తర్వాత మిగిలిన కర్రలను ఎక్కువగా మేపకూడదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందు వేయాలి.
- 30 రోజుల వయసున్న గొర్రె, మేక పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మూడు నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.
- పాలు తాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసాలు వేయకూడదు.

నివారణే లక్ష్యం.....



సాధారణంగా వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. ముందు గానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. సంవత్సరం వయసున్న గొర్రెల్లో ఎక్కువగా చిటుక వ్యాధి వస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే గొర్రెల్లోను, వలస గొర్రెల్లోనూ ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. టీకాలు వేయిస్తే జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

–ప్రభాకర్, పశుసంవర్ధకశాఖ జేడీ, చిత్తూరు

మోటర్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం

పుత్తూరు: కేంద్రం 2019లో తీసుకొచ్చిన మోటర్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో లారీ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రధాని మోదీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన మోటర్ వెహికల్ చట్టం కారణంగా డ్రైవర్ల జీవితాలు ఆందోళనకరంగా మారాయన్నారు. చిన్నపాటి తప్పిదాలకు 5 ఏళ్ల జైలు శిక్ష, భారీ జరిమానాలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. డ్రైవర్లపై ఒత్తిడి లేకుండా, వారికి రక్షణ కల్పించే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. డ్రైవర్లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మళ్లీ కొలువుదీరిన మోదీ కొత్త ప్రభుత్వంలోనైనా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, లారీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర్ ప్రసాద్, మనోహర్, వేలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రెచ్చగొట్టే చర్యలకు స్వస్తి పలకాలి

పలమనేరు: టీడీపీ కూటమి ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలపై రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించడం, అలజడులు సృష్టించడం దారుణమని వైఎస్సార్ సీపీ మున్సిపల్ కన్వీనర్ జాఫర్ పేర్కొన్నారు. తమ పార్టీ నాయకుల ఇళ్లపై రాళ్లు విసరడం, అనుచరులపై దాడులు చేయడం, హేళన చేయడం అటవిక చర్యలా ఉందని తెలిపారు. ఆదివారం గంటావూరులో అమ్మవారి జాతర సందర్భంగా తన అనుచరులు మహేష్, శెట్టిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేస్తున్నారని తెలిసి జాఫర్ అక్కడికి చేరుకున్నారు. టీడీపీ నేతలతో ఇలాంటి చర్యలు తగవని సూచించారు. రోజూ ఇలా దాడులు చేయడం, తమ పార్టీ నాయకుల ఇళ్లపై రాళ్లు విసరడం లాంటి చర్యలకన్నా అందరినీ హతమార్చేయండి మీ కసి తీరుతుందంటూ గట్టిగా నిలదీశాడు. దీంతో అక్కడి నుంచి టీడీపీ శ్రేణులు వెనుదిరిగి వెళ్లారు. అనంతరం జాఫర్ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఎప్పుడు తాము కవ్వింపు చర్యలకు పాల్పడలేదని, ఎంతో హుందాగా వ్యవహరించామని తెలిపారు. ఇకనైనా టీడీపీ నాయకులు తీరు మార్చుకోవాలని కోరారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- 117 జీవో, సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చాలి
- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు


పతాకావిష్కరణలో యూటీఎఫ్ నాయకులు

ఐరాల: ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని అధికారం చేపట్టబోయే కూటమి ప్రభుత్వాన్ని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని నాంపల్లె శ్రీగౌరీ శంకర కల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి రాబోతున్న కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వ పోకడలు ఉండాలని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం 117 జీవోను రద్దు చేస్తూ పాఠశాల విలీన ప్రకియను రద్దు చేయాలని, అదేవిధంగా సీపీఎస్ రద్దు హామీని కూడా నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతవరణంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మేధావులు, విద్యారంగా శ్రేయాభిలాషులు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు మునిరత్నం, రెహానాబేగం, కోశాధికారి ప్రసన్నకుమార్, కార్యవర్గ సభ్యులు దీనావతి, ప్రకాష్, బాషా, మాజీ గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శులు కృష్ణమూర్తి, ఏకాంబరం, రెడ్డప్పనాయుడు, మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ


కార్వేటినగరం: భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం


ప్రదర్శనను తిలకిస్తున్న జనం


తవణంపల్లె: దుర్యోధన వధ ఘట్టంలోని ఒక సన్నివేశం

తవణంపల్లె: మండలంలోని మట్టుకూరులో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధనవధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. గత నెల 23వ తేదీ నుంచి మహాభారత ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉదయం ఉదయం ఆలయంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం హరికథను మాలతీ భాగవతార్ గానం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో దుర్యోధనుడిని భీముడు వధించే ఘట్టాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. రాత్రి ఉమామహేశ్వరి నాట్య కళా మండలి ఆధ్వర్యంలో జరిగిన నాటక ప్రదర్శన అలరించింది.

కొల్లాగుంటలో..

కార్వేటినగరం: కొల్లాగుంటలో శ్రీద్రౌపదీ, ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడిని భీమసేనుడు గంగ మడుగు నుంచి తీసుకొచ్చే ఘట్టం ఆకట్టుకుంది. రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, కమిటీ మెంబర్లు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కారుని ఢీ కొన్న ఈచర్: బాలుడి మృతి




ధ్వంసమైన కారు, బోల్తాపడిన ఈచర్ వాహనం, కారులోనే మృతి చెందిన లోకేష్

- భార్య, భర్తలకు గాయాలు
- తిరుమలకు వెళ్లి వస్తుండగా ఘటన

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం వద్ద ఆదివారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆగివున్న కారును ఈచర్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. భార్యాభర్తలు గాయపడ్డారు. పోలీసుల కథనం.. బెంగళూరుకు చెందిన శివకుమార్ భార్య దీప, చెల్లెలు కుమారుడు లోకేష్‌తో కలసి తిరుమల దర్శనానికి కారులో బయలుదేరారు. మార్గ మధ్యంలో మండలంలోని కేజీ సత్రం వద్ద కారును నిలిపారు. అదే సమయంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు మామిడికాయల లోడ్‌తో వెళుతున్న ఈచర్ వాహనం ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లోకేష్(13) సంఘటన స్థలంలో మృతి చెందాడు. శివకుమార్, అతని భార్య దీప తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంతో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నందిమంగళంలో ప్రబలిన అతిసారం

- పలువురికి అస్వస్థత..బాలిక మృతి
- గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్ఓ శ్రీహరి


భవ్య (ఫైల్)

పుత్తూరు: పట్టణ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసారం ప్రబలింది. భాస్కర్, శోభ దంపతుల కుమార్తె భవ్య (12) వాంతులు, విరేచనాలతో శనివారం రాత్రి తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 4వ తేదీ మంగళవారం నుంచి పలువురు పెద్దలు, చిన్నారులు సైతం వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో భవ్యను శుక్రవారం రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 2వ తేదీన గ్రామంలో అతిసారా వ్యాధితో పలువురు అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన మున్సిపల్ అధికారులు వైద్య శిబిరం నిర్వహించి అదుపు చేశారు. మళ్లీ ఈనెల 4వ తేదీ నుంచి పలువురు అతిసారన బారిన పడ్డారు. ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసినా పరిస్థితి అదుపు కాకపోవడంతో కొందరు పిల్లలను నగరి ఏరియా ఆసుపత్రికి తరలించగా, మరి కొందరు పుత్తూరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరి కొందరికి గ్రామంలోనే చికిత్స అందిస్తున్నారు.

పరిస్థితిపై సమీక్ష

నందిమంగళం దళితవాడలో ఆదివారం సాయంత్రం డీఎంహెచ్ఓ శ్రీహరి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ప్రత్యేక శిబిరం కొనసాగిస్తూ వైద్య సేవలందించాలని వైద్య బృందాన్ని ఆదేశించారు. వర్షాలు కురుస్తుండడంతో నీరు కలుషితమైయ్యే అవకాశం ఉన్నందున గ్రామస్తులు తగిన ఆహార జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులో ఉన్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగి మృతిపై ఉద్రిక్తత

- మృతదేహంతో బంధువుల ఆందోళన
- పెద్దమనుషుల రాజీతో ప్రశాంతం


ముత్తుకుమార్ మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

కుప్పం: మండల పరిధిలోని గుడ్లనాయనపల్లె సబ్ స్టేషన్‌లో విద్యుదాఘాతంతో ఉద్యోగి ముత్తుకుమార్ మృతి చెందడంపై ఆదివారం పట్టణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. సబ్ స్టేషన్ పక్కనే ఓ ప్రైవేటు పైపుల తయారీ ఫ్యాక్టరీ నడుస్తుంది. కరెంట్ లేకపోవడంతో ఫ్యాక్టరీలో జనరేటర్‌ను స్టార్ట్ చేశారు. దీంతో విద్యుత్ సరఫరా రివర్స్ కావడంతో సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంభం పైకెక్కి మరమ్మతులు చేస్తున్న ముత్తకుమార్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, అడవిబూదుగురు గ్రామస్తులు ఫ్యాక్టరీపై దాడికి యత్నించారు. పలువురు పెద్దమనుషులు కలుగజేసుకుని ఆదుకుంటామని బాధిత కుటుంబానికి శనివారం రాత్రి నచ్చ చెప్పారు. ఆదివారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రిలో ముత్తుకుమార్ మృతదేహానికి పోస్టుమార్టమ్ జరుగుతున్న సమయంలో పైపుల ఫ్యాక్టరీ యాజమాన్యం తమకేమీ సంబంధం లేదని ఎదురు తిరిగింది. దీంతో మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఆస్పత్రి వద్ద నుంచి ప్రైవేటు ఫ్యాక్టరీ వరకు మృతదేహంతో ఊరేగింపుగా వచ్చి న్యాయం చేయాలని ధర్నా చేశారు. ఫ్యాక్టరీలో జనరేటర్ ఆన్ చేయడం వల్లనే ముత్తుకుమార్ మృతి చెందాడని తెలిసి రాజీకి ఒప్పుకుని, ఇప్పుడు తమకేమీ సంబంధం లేదని చెబుతున్నారని బాధితులు ఆరోపించారు. రెండు గంటల పాటు రోడ్డులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పెద్దమనుషులు రంగంలోకి దిగి ఇరువురి మధ్య మళ్లీ రాజీ చేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో సమస్య పరిష్కారం అయ్యింది.